సాక్షి
జనగామ
గురువారం | 5 | అక్టోబర్ | 2023



పాపం..పసికందు..

ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం లోని పాత్రాపురం శివారులో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన శిశువును చెట్ల పొదల్లో వదిలి వెళ్లారు.

- IIలో▸



పీహెచ్‌డీ అడ్మిషన్లలో దందా చేశావా?

- IIలో▸

పీహెచ్‌డీ అడ్మిషన్లలో కేయూ వీసీ దందా చేసి ఉంటారనే అనుమానం వ్యక్తమవుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు.

గరిష్టం/కనిష్టం
$32^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కొంతమేర పెరుగుతాయి.

మహిళా ఓటర్లే అధికం

జనగామ, ఘన్‌పూర్‌లో పైచేయి

- పాలకుర్తిలో పురుషుల హవా
- జిల్లాలో మొత్తం 7,16,320 మంది ఓటర్లు
- కొత్తగా నమోదైనవి 19,084 ..
- తుది ఓటరు జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం

జనగామ: రాష్ట్రంలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం బుధవారం తుది ఓటరు జాబితా వెలువరించింది. జిల్లాలో ఫైనల్‌గా 7,16,320 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపింది. ఇందులో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో పురుషులు 3,57,514, మహిళలు 3,58,787, ఇతరులు 19 మంది ఉన్నట్లు జాబితాలో ప్రకటించింది. ఇందులో మూడు నియోజకవర్గాల పరిధిలో ఈసారి 19,084 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పురుషుల కంటే 1,273 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, పాలకుర్తిలో 358 మంది పురుషుల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. బూత్ లెవల్ ఆఫీసర్లతో పాటు ఎంపీడీఓ, పాఠశాలలు, తహసీల్ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ఓటరు జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచారు.

ఓటరు నమోదు ప్రక్రియ జరిగిందిలా..

గత ఏడాది నవంబర్‌లో ఓటరు నమోదు ప్రక్రియ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. అదే నెల 9న డ్రాఫ్ట్ ఆధారంగా డిసెంబర్ 8 వరకు ఓటరు నమోదు కొనసాగింది. 16వ తేదీ వరకు అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించారు. ఈ ఏడాది జనవరి 5న తుది ఓటరు జాబితా ప్రకటించిన ఎలక్షన్ కమిషన్, జూలై 16 నుంచి రెండో విడత మరోసారి నూతన ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. సెప్టెంబర్ 19వ తేదీ నాటికి ఓటరు నమోదు ముగియగా, 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి ఫైనల్ ఓటరు జాబితాను ప్రకటించారు.





తుది ఓటరు జాబితా ప్రకటించాం..

ఎన్నికల సంఘం నియమావళి పాటిస్తూ జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రకటించాం. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు సంబంధించిన పురుషులు, మహిళలు, థర్డ్‌జెండర్ ఓటర్ల వివరాలు జాబితాలో పొందుపరిచాం. గ్రామాలు, మండలాల వారీగా ప్రభుత్వ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, బీఎల్‌ఓలు తదితరుల వద్ద జాబితా అందుబాటులో ఉంచాం.

\- సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్

తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
జనగామ	1,14,626	1,14,973	10	2,29,609
స్టేషన్‌ఘన్‌పూర్	1,20,848	1,22,132	01	2,42,981
పాలకుర్తి	1,22,040	1,21,682	08	2,43,730
మొత్తం	3,57,514	3,58,787	19	7,16,320



బచ్చన్నపేట మండలం గోపాల్‌నగర్ జీపీలో ఫైనల్ ఓటరు జాబితా ప్రదర్శన

మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు.. ఓటర్ల వివరాలు

జనగామ నియోజకవర్గ మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బచ్చన్నపేట	18,450	18,579	01	37,030
జనగామ	36,019	36,773	08	72,800
నర్మెట	9,652	9,635	-	18,287
చేర్యాల	21,388	21,382	-	42,770
తరిగొప్పుల	7,547	7,350	01	14,898
కొమురవెల్లి	7,093	7,046	-	14,139
మద్దూరు	8,257	7,962	-	16,219
దూళ్మిట్ట	6,220	6,246	-	12,466
మొత్తం	1,14,626	1,14,973	10	2,29,609
స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం				
చిల్పూరు	15,573	15,581	01	31,155
ధర్మసాగర్	18,982	19,617	-	38,599
స్టేషన్‌ఘన్‌పూర్	20,902	19,617	-	42,217
ఐనవోలు	2,761	2,841	-	5,602
ఖాజీపేట	2,134	2,191	-	4,325
లిం.ఘణపురం	15,537	15,739	-	31,276
రఘునాథపల్లి	21,197	21,175	-	42,372
వేలేరు	7,748	7,693	-	15,441
జఫర్‌గఢ్	16,014	15,980	-	31,994
మొత్తం	1,20,848	1,22,132	01	2,42,981
పాలకుర్తి నియోజకవర్గం				
పాలకుర్తి	24,527	24,378	-	48,905
దేవరుప్పుల	17,740	17,280	-	35,020
కొడకండ్ల	12,076	11,864	02	23,942
పెద్దవంగర	13,041	13,166	-	26,207
రాయపర్తి	22,177	21,981	01	44,159
తొర్రూరు	32,479	33,013	05	65,497
మొత్తం	1,22,040	1,21,682	08	2,43,730

ఆడపడుచులకు పండుగ కానుక

- దేశంలో ఎక్కడా లేని విధంగా బతుకమ్మ చీరల పంపిణీ
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు బతుకమ్మ పండుగ కానుకగా చీరలు పంపిణీ చేస్తున్న సీఎం కేసీఆర్ నిర్ణయం ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం చేపట్టిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒక కోటి రెండు లక్షల చీరలకు ప్రభుత్వం రూ.354 కోట్లు వ్యయం చేసిందని, ఈసారి కోటి మందికి నాణ్యత కలిగిన చీరలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో వృత్తిదారుల జీవితాల్లో వెలుగులు నింపినట్లు చెప్పారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తేవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో నూరుశాతం అభివృద్ధి పనులు పూర్తి చేశానని, హామీ ఇవ్వని పనులు సైతం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



పాలకుర్తి: బతుకమ్మ చీర అందజేస్తున్న మంత్రి

మసీదు ప్రారంభం

పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదు(ఏ ఫజల్ హాఫీజ్)ను మంత్రి దయాకర్‌రావు ప్రారంభించారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎండీ.రియాజ్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవాలి

నియోజకవర్గ నాయకురాలు ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల/పాలకుర్తి టౌన్ : చైతన్యవంతమైన పాలకుర్తి గడ్డపై కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవడానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం దేవరుప్పుల మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పెద్ది కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందించేందుకు వచ్చిన తనపై ప్రత్యర్థులు ఓటమి భయంతో చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. టికెట్, నామినేషన్ ప్రక్రియపై టీపీసీసీ చూసుకుంటుందనీ, ఈ విషయంలో పార్టీ శ్రేణులు గందరగోళానికి గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దశాబ్దన్నర కాలంగా నియోజకవర్గ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దయాకర్ రావు ప్రత్యర్థి పార్టీలు లేకుండా చేసేందుకు కోవర్టు రాజకీయాలకు పాల్పడ్డారనీ, ఇక అలాంటి విధానాలకు తావివ్వకూడదని పిలుపునిచ్చారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లపై ప్రజలకు భరోసా కల్పించేందుకు రామరాజుపల్లిలో తలపెట్టిన కాంగ్రెస్ సంకల్పయాత్రకు రాష్ట్ర నాయకురాలు, ములుగు ఎమ్మెల్యే సీతక్క రానున్నందున సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, హామ్నియా నాయక్, నిరంజన్ రెడ్డి, తార, గణేష్, సజ్జన్, నాగరాజు, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, లావుడ్యా భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పులలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

న్యూస్‌రీల్

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



జనగామ రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజసేవ చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. బుధవారం జనగామ మండలం పెంబర్తి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ రెసిడెన్సియల్ పాఠశాల, కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి కష్టపడడాన్ని అలవాటు చేసుకోవాలని, లక్ష్యాన్ని ముందే నిర్దేశించుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఓటు విలువపై ప్రదర్శించిన నాటికలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన డిగ్రీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ రవీందర్, ఎన్‌వీఎస్.చారి, ప్రిన్సిపాల్ అనిత, మమత, అనూష తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీకి ఘన స్వాగతం



జనగామ: ఓటు హక్కు వినియోగం, నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన సైకిల్ ర్యాలీ బుధవారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఆర్టీసీ చౌరస్తాలో డీసీపీ పి.సీతారాం, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని, ఆర్డీఓ మురళీకృష్ణ, ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ సైకిల్ యాత్రకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ఓటరు నమోదు, వినియోగంపై ప్రజకు అవగాహన కల్పిస్తూ ర్యాలీగా వెళ్లారు. జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమం, ఓటు హక్కు వినియోగంపై జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్.శివలింగయ్య ఆదేశాల మేరకు మూడు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తెలిపారు.

ప్రమోషన్లతో బదిలీలు చేపట్టాలి



బచ్చన్నపేట: ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇస్తూనే బదిలీల ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, రాజు అన్నారు. బుధవారం మండల పరిధి పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యారంగ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదని, సుమారు 25 ఏళ్ల నుంచి పనిచేస్తున్నవారు పదోన్నతి లేకుండానే రిటైర్మెంట్ పొందిన ఉపాధ్యాయులు చాలా మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు అంకుషావళి, మండల బాధ్యులు సత్యవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కృష్ణమోహన్, పలువురు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో కానిస్టేబుళ్లుగా 680 మంది ఎంపిక

వరంగల్ క్రైం: తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు ద్వారా ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్ రాత పరీక్షకు హాజరైన వారిలో సివిల్ కానిస్టేబుళ్లుగా 432 మంది, ఏఆర్ కానిస్టేబుల్– 226 మంది, ఫైర్ సిబ్బందిగా 22 మంది విజేతలుగా నిలిచారు. కమిషనరేట్ వ్యాప్తంగా 680 మంది ఎంపికయ్యారు.

'లా' డీన్‌గా ఆచార్య శ్రీనివాస్

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర విభాగాల డీన్‌గా న్యాయ శాస్త్ర విభాగాచార్యులు ఎం.శ్రీనివాస్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ ప్రస్తుత డీన్ విజయలక్ష్మి నుంచి ఈనెల 5న బాధ్యతలు స్వీకరిస్తారు. ఆచార్య ఎం.శ్రీనివాస్ 2008లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2020లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2023లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఆయన ఇప్పటి వరకు విశ్వవిద్యాలయ వసతి గృహ సంయుక్త సంచాలకులుగా, న్యాయ కళాశాల విభాగాధిపతిగా, ప్రిన్సిపాల్‌గా, పాఠ్య ప్రణాళికాధ్యక్షుడిగా, ప్రవేశాల డైరెక్టరేట్ సంయుక్త సంచాలకులుగా పని చేశారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయ ఆర్టీఐ, లీగల్ సెల్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

నోటిఫికేషన్‌లోపు ప్రొసీడింగ్స్ అందిస్తా..

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/జఫర్‌గఢ్: ఆరు నూరైనా ఈ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే నియోజకవర్గంలో దళిత బంధు, గృహలక్ష్మి తదితర పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ లబ్ధిదారులకు అందించేలా శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లను బుధవారం పంపిణీ చేసి, జఫర్‌గఢ్ మండలం తీగారంలో మహిళా కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేదల పాలిట దైవంగా పనిచేస్తున్నారని, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గడిచిన పదేళ్ల నుంచి నియోజవకర్గం గణనీయమైన అభివృద్ధి సాధించిందని చెప్పిన ఆయన.. గృహలక్ష్మి పేరిట మూడు వేల ఇళ్లు, దళితబంధు పేరిట 1,100 మందికి అందించాల్సిన బాధ్యత తనపై ఉందని, బీసీ బంధు, మైనార్టీ బంధు తదితర పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఈనెల 9లోపు పూర్తి చేస్తారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ వాసం రామ్మూర్తి, జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, ఎంపీపీలు కందుల రేఖ, రడపాక సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, సర్పంచ్ సురేష్‌కుమార్, ఎంపీఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

డీఎంహెచ్‌ఓగా సాయిశోభ

జనగామ: జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ టి.సాయిశోభ నియమితులయ్యారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ ఉస్మానియాలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పని చేస్తున్న డాక్టర్ సాయిశోభ, సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేందర్ బదిలీ కాగా యాదగిరిగుట్టలో పని చేస్తున్న డాక్టర్ ప్రశాంత్‌ను ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానంలో సాయిశోభ వస్తున్నారు.

నాడు చిలుక పలుకులు.. నేడు విమర్శలా..

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ : దేశంలోని 22 రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని స్వయంగా చిలుక పలుకులు పలికిన మోదీ.. నేడు విమర్శలు చేస్తున్నారు.. ఆయన సర్పంచ్ స్థాయికి దిగజారి మాట్లాడడం సిగ్గు చేటని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓం సాయి గార్డెన్‌లో జనగామ అర్బన్, మండలం, బచ్చన్నపేట మండల పరిధి మహిళా లబ్ధిదారులకు బుధవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కేటీఆర్‌ను సీఎం చేసుకోవాలంటే పార్లమెంట్ అప్రూవల్ కావాలా.. మా యువనేతను బరాబర్ ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. కేసీఆర్ రాష్ట్రంలో సంపదను పెంచుతూ అభివృద్ధి, సంక్షేమం పేరిట ప్రజలకు పంచుతున్నారని, మోదీకి దమ్ముంటే దేశ ఆర్థిక సంపదను పెంచాలని హితవు పలికారు. తెలంగాణ సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు పెట్టుకున్నామని, కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి ఆ మహనీయుడి పేరు ఎందుకు పెట్టడం లేదో బీజేపీ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం అన్ని పండగలను, మతాలను సీఎం కేసీఆర్ గౌరవిస్తున్నారని పేర్కొన్నారు. జనగామ ఎమ్మెల్యేగా తనను మూడోసారి గెలిపించాలని కోరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు బండ పద్మ, పగిడిపాటి సుధాసుగుణాకర్‌రాజు, పేర్ని స్వరూప, నాగజ్యోతి, పాండు, గుర్రం నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

జనగామ రూరల్: భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా ఉంటున్న వయో వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన పట్టణంలో బుధవారం నిర్వహించిన ర్యాలీని అదనపు కలెక్టర్ సుహాసిని ప్రారంభించారు. అనంతరం విజయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సంక్షేమాధికారి జయంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలను పెంచి పెద్ద చేసి ప్రయోజకులుగా మార్చిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాధారణకు గురవుతున్నారని, అయినా కృంగిపోకుండా నిలబడి వారు ఎంచుకున్న రంగాల్లో అనుభవాలను పంచి సమాజాభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. కన్నవారిని జీవిత కాలం చూసుకోవల్సిన బాధ్యత పిల్లలపై ఉందని, కష్టపెట్టకుండా వారికి సేవలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. వయోవృద్ధుల పోషణ చట్టం–2007 నియమావళిపై అవగాహన కలిగి ఉండాలని, వయోవృద్ధుల పూర్తి బాధ్యత కుటుంబ సభ్యులదే అని అన్నారు. వారిని శారీకరంగా, మానసికంగా వేధిస్తే శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలున్నా ఆర్డీఓ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ మురళీకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, రామస్వామి, వీరన్న, మహబూబ్‌రెడ్డి, రాజయ్య, సీడీపీఓ రమాదేవి, ఫ్లోరెన్స్, విజయలక్ష్మి, విక్టోరియా, రేణుక, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ.. రెండింటి మధ్యే పోరు!

- మారుతున్న రాజకీయ సమీకరణలు
- కారు జోరుకు బ్రేక్‌లు వేసేలా కాంగ్రెస్ కసరత్తు
- తాజా పరిణామాలతో వికసించే పరిస్థితిలేని కమలం
- మూడో స్థానానికి పరిమితం కానున్న బీజేపీ..
- మెజార్టీ స్థానాల్లో పాగా వేసేలా కాంగ్రెస్ కసరత్తు
- చేజారి పోకుండా పావులు కదుపుతున్న గులాబీ దళం

సాక్షిప్రతినిధి, వరంగల్: ఓరుగల్లులో రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమయ్యాయి. ఉద్యమాల ఖిల్లా ఉమ్మడి వరంగల్‌లో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వర్ధన్నపేట, స్టేషన్ ఘనపూర్ రెండు ఎస్సీలకు, ములుగు, మహబూబాబాద్, డోర్నకల్ మూడు ఎస్టీలకు రిజర్వుడు కాగా.. ఏడు జనరల్ స్థానాలున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ పార్టీలు దూకుడు పెంచి బలాన్ని, బలగాన్ని పెంచుకునే పనిలో నిమగ్నమయ్యాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో అధికార పార్టీ బీఆర్‌ఎస్ కారు జోరుకు బ్రేక్ పడేలా కాంగ్రెస్ భారీ కసరత్తే చేస్తోంది. బీఆర్‌ఎస్ మాత్రం గత ఎన్నికల్లో రెండు గెలిచి ఒకటికే పరిమితమైన కాంగ్రెస్‌కు ఈసారి ఆ ఒక్కటి కూడా దక్కకుండా చేయాలని చూస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే ఎత్తుకు పైఎత్తులతో సత్తా చాటుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఒకటి రెండు చోట్ల రెండో స్థానానికి పోటీ పడే పరిస్థితి ఉన్నా మిగతా చోట్ల ఊసే లేని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ములుగు మినహా అన్నీ బీఆర్‌ఎస్ స్థానాలే...

ఓసారి 2018 అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితి చూస్తే అప్పుడు అధికార పార్టీ టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్)ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్, వామపక్షాలు కలిసి మహా కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలోకి దిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో, బీజేపీ ఒంటరిగా పోటీ చేయగా మహాకూటమి పొత్తులో భాగంగా కాంగ్రెస్ పది స్థానాల్లో పోటీచేసి రెండు స్థానాలను మిత్ర పక్షాలైన టీడీపీ, టీజేఎస్‌కు చెరో స్థానం కేటాయించారు. అప్పట్లో వరంగల్ పశ్చిమ నుంచి టీడీపీ తరఫున రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట నుంచి టీజేఎస్ అభ్యర్థిగా దేవయ్య పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కూటమి తరఫున పది స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలో గెలుపొందింది. ములుగు నుంచి సీతక్క, భూపాలపల్లి నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపొందినప్పటికి అనతికాలంలోనే గండ్ర వెంకటరమణారెడ్డి కాంగ్రెస్‌కు చేయిచ్చి కారెక్కి గులాబీ గూటిలో చేరాడు. దీంతో ములుగు మినహా అన్ని స్థానాలు బీఆర్‌ఎస్‌వే అయ్యాయి.

కంచికి చేరని 'టికెట్ల'కథ..

ప్రస్తుతం 11 చోట్ల బీఆర్‌ఎస్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండగా, రెండు చోట్ల టికెట్ నిరాకరించింది. స్టేషన్ ఘనపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు బదులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి టికెట్ ఖరారు చేశారు. జనగామలో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని కాదని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి టికెట్ ఖరారు చేసే పనిలో గులాబీ బాస్ బిజీగా ఉన్నారు. ఇక కాంగ్రెస్ సిట్టింగ్ స్థానమైన ములుగులో సీతక్కకు దీటైన అభ్యర్థి ఆదివాసీ బిడ్డ, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని ఎన్నికల బరిలోకి దింపారు. ఇప్పటివరకు బీఆర్‌ఎస్ జనగామ మినహా అన్ని స్థానాల అభ్యర్థులు ఖరారు కాగా, కాంగ్రెస్, బీజేపీలు ఇంకా అభ్యర్థుల ఎంపిక కసరత్తు స్థాయిలోనే ఉంది. త్వరలోనే ఈ పార్టీల అభ్యర్థుల తొలి జాబితా వెలువడే అవకాశాలు ఉండగా.. టికెట్ల కథ కంచికి చేరితేనే పోరు మరింత ఉధృతం కానుంది.

ఎవరి ధీమా వారిదే..

ఐదారు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదవుతుందన్న ప్రచారం మేరకు ప్రధాన పార్టీల నేతలు ఎవరికీ వారుగా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో ముందున్న బీఆర్‌ఎస్ ప్రచారాన్ని ముమ్మరం చేసి ప్రజలతో మమేకమవుతోంది. గంపగుత్తగా 12 స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీమ్‌లను ప్రజల్లోకి తీసుకెళ్లి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తోంది. అయితే అభ్యర్థులు ఖరారు కాక, గ్రూప్ రాజకీయాలు ఆ పార్టీకి కాస్త ఇబ్బందిగా మారే పరిస్థితులు ఉన్నాయి. ఇక బీజేపీ సైతం అభ్యర్థుల ఎంపికపై కుస్తీ పడుతూ ప్రజల మద్దతు కూడగట్టుకోవడంలో వెనుకబడిపోతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏదేమైనా పోరాటాల పురిటి గడ్డ ఓరుగల్లులో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా బ్యాలెట్ పోరు సాగనుందన్న చర్చ సాగుతోంది.

మోదీ అయ్యకూడా అడ్డుకోలేడు..

- సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు శ్రీరామరక్ష
- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

జనగామ: తెలంగాణ సీఎంగా కేటీఆర్‌ను ప్రధాన మంత్రి మోదీ అయ్యకూడా అడ్డుకోలేడని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డితో కలిసి ఆయన బుధవారం మాట్లాడారు. ఎమ్మెల్యేల మద్దతుతో కేటీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని.. ఇందుకు మోదీ ఆశీర్వాదం అవసరం లేదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధాన మంత్రిగా ఉండి తెలంగాణ పుట్టుక, ఇక్కడి ప్రజాప్రతినిధులపై దిగజారి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడడాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని అన్నారు. ప్రసవం జరిగి తల్లి చనిపోయిందంటూ.. రెండు రాష్ట్రాల విభజనలో ఏపీకి నష్టం జరిగిందని మాట్లాడిన ప్రధాని కళ్లు లేని కబోదిలా మాట్లాడడం మన దౌర్భాగ్యమన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రంలోని బీజేపీ సన్యాసులు మీ దృష్టికి తీసుకు రాలేదనా అని ప్రశ్నించారు. ఏపీలో పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి.. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. అడుగడుగునా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ మాకు అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు చీము, నెత్తురు ఉంటే ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా వచ్చేలా మోదీని ఒప్పించాలని అన్నారు. సమావేశంలో లింగాలఘణపురం జెడ్పీటీసీ గుడి శంశీధర్ రెడ్డి, మాజీ కొమురవెల్లి ఆలయ చైర్మన్ సేవెల్లి సంపత్, చిట్ల ఉపేందర్‌రెడ్డి, పోకల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

పెన్షనర్ల సమస్యలు పట్టని సర్కారు

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదిగో పీఆర్సీ.. ఇదిగో పీఆర్సీ అంటూ ఊరించి కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు 5శాతం ఐఆర్ ప్రకటించారని, ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు బగ్గుమంటున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే సమస్యలు పరిష్కరిస్తూ ఉత్తర్వులివ్వాలని, లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



క్లుప్తంగా

ఎరువుల దిగుమతి



వ్యాగన్ నుంచి లారీలోకి ఎరువులు దిగుమతి చేస్తున్న హమాలీలు

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్డులోకి కొన్ని రోజుల నుంచి పెద్ద ఎత్తున ఎరువులు దిగుమతి అవుతున్నాయి. మంగళవారం కాకినాడ పోర్ట్ నుంచి 41 వ్యాగన్లలో 2600 మెట్రిక్ టన్నుల నాగార్జున యూరియా వచ్చిందని, బుధవారం ఒడిశా నుంచి 41 వ్యాగన్లలో ఇఫ్కో డీఏపీ వచ్చిందని రైల్వే అధికారులు తెలిపారు. వాటిని అధికారులు వెంటనే లారీలు ద్వారా ఉమ్మడి జిల్లాలోని పలువురు డీలర్లు, సొసైటీలు తరలిస్తున్నారు. రైతులకు ఎలాంటి ఎరువుల కొరత రాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, ఇందులో భాగంగానే వస్తున్నాయని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో 'విద్యుత్' అంశాలు చేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ ఉద్యోగుల అంశాలు చేర్చాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబును టీఎస్ ఈఈయూ–327 సెక్రటరీ జనరల్ ఇసుగాల శ్రీధర్, నాయకుల బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. పాత పెన్షన్ పునరుద్ధరించి కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, ఆర్టిజన్స్‌కు ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని, తదితర ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే, ఈ అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాదం రామకృష్ణా రావు, మాధవరావు, జక్కుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్నాడనే మర్డర్..

- రాజు హత్యకు పక్కా పథకం
- కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ వెల్లడి
- నిందితుల అరెస్ట్, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్

హసన్‌పర్తి : ఓ వివాహితను వేధింపులకు గురి చేయడమే రాజు హత్యకు దారి తీసింది. ఈ హత్యలో వివాహిత తండ్రి, సోదరులు, మామయ్య, తల్లితోపాటు భర్త కూడా పాల్గొన్నట్లు కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజు హత్యకు దారి తీసిన వివరాలను ఏసీపీ వెల్లడించారు. హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన తుమ్మల రాజు(28) ఇదే మండలం అన్నాసాగరం గ్రామానికి చెందిన బైకాని కుమారస్వామి కూతురిని కొంతకాలంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాధితురాలు కుటుంబ సభ్యుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది.

రెండు సార్లు తప్పించుకున్నాడు..

రాజును హత్య చేయడానికి కుమారస్వామి కుటుంబ సభ్యులు నిర్ణయించారు. బాధితురాలి కూతురు చదువుతున్న న్యూశాంపేటలోని స్కూల్ వద్ద తుమ్మల రాజు వస్తున్నాడనే సమాచారంతో హత్య చేయాలని పథకం వేసినప్పటికీ రాజు తప్పించుకున్నాడని ఏసీపీ తెలిపారు.

పక్కా పథకం..

కాగా, రాజును ఎలాగైనా హత్య చేయాలని పక్కా పథకం వేశారు. ఈ క్రమంలో గత నెల 30వ తేదీన రాజు అన్నాసాగరంలో ఉన్నాడనే విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి బైకాని కేతమ్మ.. భర్త కుమారస్వామి, సోదరుడు ఎల్లబోయిన అనిల్‌కుమార్, కుమారుడు బైకాని శివకుమార్,అల్లుడు మామిండ్ల సంజీవ్‌కు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న వారు గ్రామంలో రాజుపై దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత రాజును ఇంటి నుంచి తీసుకెళ్లి కాళ్లు, చేతులను తాడుతో కట్టారు. ఆటోలో ఎక్కించుకుని జయగిరి సమీపంలోని ఎస్సారెస్పీలో పడేశారు.

మృతదేహం కోసం గాలింపు...

రాజు మృతదేహం కోసం నాలుగు బృందాలుగా విడిపోయి గాలించినట్లు డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ క్రమంలో వర్ధన్నపేట మండలం కట్ర్యాల సమీపంలోని ఎస్సారెస్పీలో రాజు మృతదేహం లభ్యమైనట్లు ఏసీపీ చెప్పారు.

వైస్ ఎంపీపీ సహకారంతో..

కాగా, నిందితులు కుమారస్వామి, శివకుమార్, అనిల్, కేతమ్మ, సంజీవ్..మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బండా రత్నాకర్‌రెడ్డి సహకారంతో లొంగిపోయినట్లు ఏసీపీ వివరించారు. రాజును హత్య చేసినట్లు వారు అంగీకరించినట్లు డేవిడ్ రాజ్ తెలిపారు. మృతుడి భార్య రవళి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు.నిందితుల నుంచి ఆటోతో పాటు రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సైలు సురేష్, అశోక్, వలీ, హెడ్‌కానిస్టేబుల్ విద్యాసాగర్, కానిస్టేబుల్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- హనుమకొండ డీఐఈఓ గోపాల్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈఓలు

రామన్నపేట : క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమితో కృంగిపోకుండా గెలుపు కోసం ప్రయత్నించాలని హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ అన్నారు. బుధవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్‌బీ కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అండర్ –19 విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ, యోగా, చెస్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, క్రికెట్, తదితర క్రీడా పోటీలు, ఎంపికలను హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ డీఐఈఓలు ఎ.గోపాల్, మాధవరావు, సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఐఈఓ గోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు ఈ పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికై జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. ఈ క్రీడా పోటీల్లో సుమారు 550 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.గోపి తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డిహెచ్‌రావు, ఏవీవీ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ కవిత, హనుమకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, ప్రైవేట్ కళాశాల ప్రెసిడెంట్లు సురేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

9 నుంచి బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్ : 2017 సంవత్సరం కంటే ముందు ఇయర్ వైజ్ స్కీమ్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయ బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థుల డిగ్రీ వార్షిక పరీక్షలు (సప్లిమెంటరీ) ఈనెల 9 నుంచి ప్రారంభమై నవంబర్ 14వ తేదీ వరకు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి బుధవారం తెలిపారు. వీరికి సంబంధించిన సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షలు నవంబర్ 15 నుంచి నవంబర్ 21వ తేదీ వరకు, సప్లిమెంటరీ అంతర్గత పరీక్షలు నవంబర్ 22, 23 తేదీల్లో జరుగుతాయన్నారు. మొత్తం విశ్వవిద్యాలయ పరిధిలో 14 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. వీటిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 4 ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడొచ్చని వారు తెలిపారు.

పాపం.. పసికందు..

- పొదల్లో పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- పాత్రాపురం శివారులో ఘటన
- శిశువును ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- నిలకడగా పాప ఆరోగ్యం



శిశువుకు చికిత్స నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): పాపం.. పసికందు.. ఆడపిల్ల భారమనుకున్నారో..? లేదా నెలలు నిండకముందే జన్మించిందనుకున్నారో..? లేదా ఇతర కారణాల వల్లనో గాని శిశువును వదిలించుకున్నారు. తల్లి గర్భంలో ఎన్నో గండాలు.. మరెన్నో సుడిగుండాలు తట్టుకుని జీవం పోసుకున్న ఆ శిశువు.. ఆరు నెలల అనంతరం బహ్యా ప్రపంచంలోకి అడుగిడింది. అయితే అమ్మ ఒడిలో హాయిగా సేదదీరాల్సిన ఆ శిశువు పొదల్లో దర్శనమిచ్చింది. దిక్కులు పిక్కటిల్లేలా గుక్కపెట్టి ఏడుస్తోంది. ఈ శబ్దం విన్న గ్రామస్తులు అక్కడి వెళ్లి చూడగా ఆ పసిమొగ్గ దీనస్థితిలో కనిపించింది. ఈ హృదయవిదారక ఘటనను చూసి వారు చలించిపోయారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని శిశువును ఆస్పత్రికి తరలించారు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం మండలంలోని పాత్రాపురం శివారులోని పొదల్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం ఆడ శిశువును పడేసి వెళ్లారు. ఈ శిశువును చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకుని శిశువును వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ శిశువు తల్లిదండ్రుల వివరాలు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. కాగా, శిశువు పూర్తి నెలలు నిండకుండానే 7 నెలలో జన్మించిందని, పాపను వరంగల్ ఎంజీఎంకు తరలిస్తున్నట్లు వైద్యాధికారి విజిస్టర్ తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో దందా చేశావా?

- కేయూ వీసీ రమేష్‌కు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రశ్న
- విద్యార్థి జేఏసీ దీక్షల శిబిరాన్ని సందర్శించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కేయూ క్యాంపస్: పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని 29 రోజుల నుంచి కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తుంటే వీసీ తాటికొండ రమేష్ ఎందుకు దీక్షల వద్దకు వచ్చి విద్యార్థి నాయకులతో మాట్లడడం లేదని, వీసీ రావడం లేదంటే అడ్మిషన్లలో దందా చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్ రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి జేఏసీ నిర్వహిస్తున్న దీక్షలు బుధవారంతో 29వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్ష శిబిరంలో విద్యార్థి నాయకులను ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆందోళన చేస్తే పోలీసులకు అప్పగించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అమానుషమన్నారు. అంతేగాకుండా ఇద్దరు విద్యార్థి నాయకులను 15 రోజులు జైలుకు పంపడం దారుణమన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను అధికంగా నేరాలు చేసిన వారిపై ప్రయోగించాల్సింటుంది కాని విద్యార్థులపై కాదన్నారు. తాను కూడా పోలీస్ అధికారిగా వరంగల్‌లోనే పనిచేశానన్నారు. అనంతరం కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ గుండాల మదన్‌కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి జాక్ నాయకులు మాచర్ల రాంబాబు, డాక్టర్ మంద వీరస్వామి, అరెగంటి నాగారాజు, అంకెళ్ల శంకర్, నిమ్మల రాజేష్, మట్టెడకుమార్, ఎండీపాషా, మంద నరేష్, బొట్ల మనోహర్, కేతిపాక ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మరోసారి కూడా గ్రూప్ –1 పరీక్ష నిర్వహణలో విఫలమై రద్దుకు కారణమైన టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ బహిరంగ లేఖ విడుదల చేశారు.

బిడ్డా.. ఒక్కసారి లేవరా

- కుమారుడి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు
- సంపులో పడి బాలుడి మృతి
- కేసముద్రం విలేజ్‌లో ఘటన



కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

కేసముద్రం: అప్పటి వరకూ తల్లిదండ్రుల కళ్ల ఎదుటే ఉన్న ఆ చిన్నారి ఒక్కసారిగా విగతజీవిగా మారాడు. సరదాగా ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి కనిపించని లోకాలకు వెళ్లాడు. క్షణ కాలం వరకు తమ ఎదుటే ఆడుతూ.. అల్లరి చేసిన కుమారుడు శవమై కనిపించడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. అయ్యో కొడుకా మమ్మల్ని వదిలివెళ్లిపోయావా..ఒక్కసారి లేవరా బిడ్డా అంటూ కొడుకు శవాన్ని పట్టుకుని దిక్కులు పిక్కటిల్లేలా కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషాదకర ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రంవిలేజ్‌లో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం కేసముద్రంవిలేజ్‌కి చెందిన గుండెబోయిన అశోక్, శారద దంపతులకు ఇద్దరు కుమార్తెలు నిఖిత, సుస్మిత , కుమారుడు తరుణ్‌కుమార్(3) ఉన్నారు. అశోక్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో అప్పటి వరకు ఇంటి వద్ద ఉన్న అశోక్ తన కుమారుడిని ఆడించాడు. ఇంతలో తన ఆటో సీరియల్ రావడంతో కొడుకా ఇంట్లోనే ఆడుకోరా అంటూ దిగబెట్టి, తాను కేసముద్రంస్టేషన్‌కి వెళ్తున్నానంటూ భార్యతో చెప్పాడు. శారద ఇంట్లో పనిచేసుకుంటూ ఉండగా, కొడుకు ఆడుకుంటూ పక్కింటికి వెళ్లాడు. ఈక్రమంలో ఆ ఇంటి ఆవరణలోని నీటి సంపులో పడడంతో నీటమునిగి మృతి చెందాడు. ఇంతలో కొడుకు కనిపించకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికింది. అనుమానంతో పక్కింటికి వెళ్లి నీటిసంపులో చూడడంతో నీటిలో మునిగి కనిపించాడు. ఒక్కసారిగా రోదిస్తూ, కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి బాలుడిని సంపు నుంచి బయటకు తీశారు. హుటాహుటినా స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి వరకు ఎత్తుకుని తిరిగిన తండ్రికి ఆ కొద్ది సమయంలోనే బిడ్డ శవమై కనిపించడంతో గుండెలు బాదుకుంటూ విలపించాడు. బిడ్డ శవాన్ని పట్టుకుని ఒక్కసారి లేవరా..మమ్మల్ని చూడరా బిడ్డా అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారి హృదయాలను కలచివేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఔషధ తనిఖీ అధికారుల సంఘం జాతీయ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

కేయూ క్యాంపస్ : తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఔషధ తనిఖీ అధికారుల సంఘం జాతీయ అధ్యక్షుడు గుండెమీది కోటేశ్వర రావు కోరారు. తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ ఆరుగురు సభ్యుల ఎన్నికల కోసం కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 19 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు ఫార్మసీ.. మెడిసిన్‌కు సమానంగా ఉండే కోర్సు అన్నారు. ప్రస్తుతం ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ తమ సర్టిఫికెట్లను అద్దెకు ఇవ్వడం వల్ల వాటి విలువలు పడిపోయాయన్నారు. ప్రొఫెసర్ సమ్మయ్య మాట్లాడుతూ సివిల్ సర్వీస్‌లో ఫార్మసీ సబ్జెక్టులని చేర్చాలని, ఎలక్షన్ మేనిఫెస్టోలో ఫార్మసిస్ట్ కం ఓనర్ అనే జీవోను తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్, ప్రొఫెసర్ కృష్ణవేణి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కిరణ్‌కు న్యాయం చేయాలి

- కంచనపల్లి గ్రామస్తుల డిమాండ్
- సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన
- విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లిలో విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యంతో కరెంట్ షాక్‌తో స్థానిక ప్రైవేట్ హెల్పర్ బాస్కుల కిరణ్ తీవ్ర గాయాలపాలైన ఘటనపై బుధవారం సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్తులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం విద్యుత్ లైన్‌మెన్ సోమయ్య స్థానిక సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న జేఎల్‌ఎం వీరస్వామికి సమాచారం ఇచ్చి ఎల్‌సీ తీసుకుని కిరణ్‌తో బీసీ కాలనీలో స్తంభం ఎక్కించి పనులు చేయిస్తున్నాడు. అయితే పని పూర్తికాకముందే లైన్ ఆన్ చేయడంతో కరెంట్ షాక్ తగిలి కిరణ్ తీగలపైనే తలకిందులై తీవ్ర గాయాలపాలైన విషయం విధితమే. ప్రతుతం కిరణ్ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు ఉదయమే సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై రఘుపతి, విద్యుత్ ఏడీఏ మనోహర్‌రెడ్డి, ఏఈ రాహుల్ ఘటనాస్థలికి చేరుకుని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆందోళనకారులు శాంతించలేదు. లైన్‌మెన్, జేఎల్‌ఎంలపై చర్యలు తీసుకుని కిరణ్‌కు మెరుగైన వైద్యంతో పాటు రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని పట్టుబట్టారు. చివరకు అధికారులు, గ్రామపెద్దలు చర్చలు జరిపి బాధితుడికి వెంటనే రూ 4 లక్షలు ఇవ్వాలని, చికిత్స తర్వాత మరింత ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించడంతో ఆందోళన సద్దుమణిగింది. కార్యక్రమంలో వెల్ది సర్పంచ్ కొయ్యడ మల్లేష్, గవ్వాని నాగేశ్వర్, కేమిడి రాజు, దైద ప్రభాకర్, గొల్లూరి పృథ్వీ, కడుదుల హరినాథ్, రంగోజు ఈశ్వరయ్య, లోనె రవి, గుండె జోసఫ్, సుంచు సురేందర్, రాపోలు పృథ్వీ, పురుషోత్తం, దర్శనాల రవి, కొడగాని నానాజీ, రాజేందర్, రమేష్, భిక్షపతి, రాములు, గొంగళ్ల కృష్ణ, వంగ రవి, మనోజ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలింపు.. యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: తల్లి మందలించిందనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఉర్సు కరీమాబాద్ రోడ్డు మహంకాళీ గుడి సమీపంలో జరిగింది. ఎస్సై మున్నీర్ ఉల్లా కథనం ప్రకారం వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన మారోజు సోమేశ్వరాచారి, కవిత దంపతుల రెండో కుమారుడు రాము (32) గోల్డ్ స్మిత్‌వర్క్ చేస్తున్నాడు. ప్రస్తుతం ఏ పనిచేయకుండా ఇంటికే పరిమితమయ్యాడు. పెళ్లి కావాలంటే ఏదైనా ఒక పనిచేయాలని తల్లి కవిత.. రామును పలుమార్లు మందలించింది. దీనికి మనస్తాపానికి గురైన రాము బుధవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుడే బయటకు వెళ్లి ఇంటికి చేరిన తల్లి గమనించి తలుపులను తొలగించి చూడగా రాము అప్పటికే మృతి కనిపించాడు. వెంటనే ఈ విషయం మిల్స్‌కాలనీ పోలీసులకు తెలుపగా ఎస్సై ఎండీ మున్నీర్ ఉల్లా సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు రంజిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మున్నీర్ ఉల్లా తెలిపారు.

రైలు కిందపడి హమాలీ..



రాజు మృతదేహం

కాశిబుగ్గ: రైలు కింద పడి ఓ హమాలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం గీసుకొండ మండలం ధర్మారానికి చెందిన ఆడప రాజు(29) గొర్రెకుంట పారిశ్రామిక ప్రాంతంలోని హోల్‌సేల్ కాంప్లెక్స్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన రాజు.. తన వ్యక్తిగత కారణాలతో ధర్మారం రైల్వే గేట్ సమీపంలో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించామని జీఆర్పీ సీఐ నరేష్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

- దాట్ల గ్రామంలో ఘటన
- ఆర్‌ఎంపీపై కేసు నమోదు



యాకన్న (ఫైల్)

దంతాలపల్లి: వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దాట్లలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చిత్తలూరి యాకన్న(35) దివ్యాంగుడు. కిరాణం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న యాకన్న.. జ్వరంతో బాధపడుతూ గత నెల 18న గ్రామంలోని ఆర్‌ఎంపీ గుండాల ఐలయ్య వద్ద చికిత్స పొందాడు. సదరు ఆర్‌ఎంపీ.. జ్వరం తగ్గేందుకు యాకన్నకు ఇంజక్షన్ ఇచ్చి ట్యాబ్లెట్లు రాసి పంపించాడు. అయితే మరుసటి రోజు శరీరం తోపాటు కడుపులో మంట వస్తుందని యాకన్న తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ అతడికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఎక్కువ మోతాదు కలిగిన ఇంజక్షన్ ఇచ్చారని తెలిపారు. దీని వల్ల శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతుందని, వెంటనే మెరుగైన వైద్యం పొందాలని చెప్పడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి తక్షణమే మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రికి తరలించాలని సూచించడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో యాకన్న అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆర్‌ఎంపీ ఇంజక్షన్ మూలంగానే యాకన్న మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఈ ఘటనపై బంధువులు, గ్రామస్తులు ఆర్‌ఎంపీ ఇంటి ఎదుట ధర్నా చేయడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రమేష్‌బాబు.. ఘటనాస్థలికి చేరుకుని బంధువులు, గ్రామస్తులకు సర్దిచెప్పి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి తల్లి ఎల్లమ్మ, భార్య మనీషా (మానసిక దివ్యాంగురాలు), కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, ఏమి జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్న భార్య, తన పిల్లలను ఎలా సాకాలో తెలియక రోదిస్తున్న తల్లి ఎల్లమ్మను చూసి గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు.



రోదిస్తున్న మృతుడి తల్లి ఎల్లమ్మ

సాక్షి బిజినెస్
గురువారం
5-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
286	93
65,226	19,436

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,154	△	95
డోజోన్స్	32,975	▽	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,412	▽	58
డాక్స్	15,100	△	15
షాంఘై (గురువారం ముగింపు)	3,110	△	3
నికాయ్	30,527	▽	711

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,653	▽	22
బంగారం (99.5 స్వచ్ఛత)	56,426	▽	22
వెండి (కేజీ)	67,446	△	409

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.87	102.21
€	యూరో	ఎస్‌బీఐ	85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.95	56.65
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.46	53.74
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.65	61.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.25

సూపర్‌డ్రైతో రిలయన్స్ జత

- 24:76 శాతం వాటాతో జేవీ ఏర్పాటు
- దక్షిణాసియా ఐపీ ఆస్తుల కొనుగోలు

న్యూఢిల్లీ: దక్షిణాసియా మేధో హక్కుల(ఐపీ ఆస్తులు) విక్రయానికి రిలయన్స్ రిటైల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ఫ్యాషన్ రిటైలర్ సూపర్‌డ్రై తాజాగా పేర్కొంది. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ) ద్వారా రిలయన్స్ రిటైల్ 4 కోట్ల పౌండ్లు(రూ. 402 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా స్వెట్‌షర్టులు, హుడీస్, జాకెట్స్ తదితర ఫ్యాషన్ ప్రొడక్టులను రూపొందిస్తున్న సూపర్‌డ్రై.. జేవీలో 24 శాతం వాటాను పొందనుంది. మిగిలిన 76 శాతం వాటా రిలయన్స్ రిటైల్ చేతిలో ఉంటుంది. ఒప్పందం ప్రకారం సూపర్‌డ్రై బ్రాండ్ ఐపీ ఆస్తులు కొత్తగా ఏర్పాటు చేయనున్న జేవీకి శాశ్వతంగా బదిలీకానున్నాయి. రిలయన్స్ బ్రాండ్స్ హోల్డింగ్ యూకేతో ఐపీ జేవీ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సూపర్‌డ్రై పీఎల్‌సీ.. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. తద్వారా భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సూపర్‌డ్రై బ్రాండుసహా.. సంబంధిత ట్రేడ్‌మార్క్‌లను జేవీకి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది.

నిధుల ఆవశ్యకత: సూపర్‌డ్రై ఇటీవల హోల్‌సేల్ కస్టమర్ల నుంచి బలహీన ఆర్డర్ల కారణంగా స్టాక్ నిల్వలు, లిక్విడిటీ తదితర అంశాలలో సవాళ్లు ఎదుర్కొంటోంది. దీంతో జేవీకి తెరతీసింది. దీంతో స్థూలంగా 3.04 కోట్ల పౌండ్ల నగదు లభించనుందని అంచనా వేస్తోంది. కాగా.. తాజా ఒప్పందంతో రిలయన్స్ దక్షిణాసియాలోని మూడు దేశాలలో కార్యకలాపాలు చేపట్టనున్నట్లు సూపర్‌డ్రై తెలియజేసింది. జేవీలో సూపర్‌డ్రై వాటాను కొనసాగించడంతోపాటు.. తమ నైపుణ్యం ద్వారా బ్రాండ్ డెవలప్‌మెంట్, డిజైన్, మార్కెటింగ్‌లలో మద్దతిస్తుందని రిలయన్స్ బ్రాండ్స్ ఎండీ దర్శన్ మెహతా చెప్పారు. భారత్ భారీ అవకాశాల మార్కెట్‌కాగా.. రిలయన్స్‌తో పటిష్ట బంధమున్నట్లు సూపర్‌డ్రై వ్యవస్థాపకుడు, సీఈవో జూలియన్ డంకెర్టన్ పేర్కొన్నారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్లు

- భారత వాహన రంగంపై అంచనా
- ఆర్థర్ డి లిటిల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం 2035 నాటికి ఎగుమతి ఆధారిత ట్రిలియన్ డాలర్ పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉందని ఆర్థర్ డి లిటిల్ నివేదిక పేర్కొంది. తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత తోడుగా పరిశ్రమ ఈ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది. 'భారత వాహన పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లకు డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తికి ఆకర్షణీయ ప్రపంచ కేంద్రంగా మారవచ్చు. దీనిని సాధించడానికి ఈ రంగంలోని కంపెనీలు ప్రపంచ తయారీకి అనుగుణంగా తమ సామర్థ్యాలను విశ్వసనీయ, పోటీతత్వంగా మెరుగుపర్చుకోవాలి. జోనల్ ఆర్కిటెక్చర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా పరిష్కారాలను అందించడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో భారత శక్తి సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నిధులతో కూడిన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో భారతదేశం వాహన రంగంలో నాయకత్వ స్థానంలో ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించింది.



నాయకత్వ స్థానంగా..: దేశీ వాహన రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణల వేగాన్ని, మారుతున్న సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే భారతదేశాన్ని ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో నాయకత్వ స్థానంగా మార్చవచ్చని నివేదిక తెలిపింది. 'ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్ పరిశోధన, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు వృద్ధి చెంది 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్‌గా, ఆఫ్‌షోర్ గమ్యస్థానంగా తన స్థానాన్ని ఉపయోగించుకోవచ్చు. భారత వాహన పరిశ్రమ నిజమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వంతో సహా ముడిపడి ఉన్న భాగస్వాముల మధ్య బలమైన చర్చలు, సమిష్టి చర్యలు అవసరం' అని నివేదిక వివరించింది.

నెల కనిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ ప్రతికూల సంకేతాలు
- ఎఫ్ఐఐల వరుస విక్రయాల ప్రభావం

ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం కొనసాగడంతో స్టాక్ మార్కెట్ రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 286 పాయింట్లు పతనమై 65,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు క్షీణించి 19,436 వద్ద నిలిచింది. రెండు సూచీలకు ముగింపు స్థాయిలు నెల కనిష్టం. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తత వహించారు. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 633 పాయింట్లు నష్టపోయి 65 వేల స్థాయి దిగువన 64,879 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు పతనమై 19,334 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. విదేశీ



ఇన్వెస్టర్లు రూ.4,424 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,769 కోట్ల షేర్లను కొన్నారు.

- అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3% పెరిగి రూ.2464 వద్ద స్థిరపడింది. అబుదాబీ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హోల్డింగ్(ఐహెచ్‌సీ) ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదానీలో తన వాటాను 4.98% నుంచి 5.04 శాతానికి పెంచుకోవడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- అప్‌డేటర్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.300)తో 0.03 స్వల్ప డిస్కౌంట్‌తో 299.90 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 6% క్షీణించి రూ.282 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 5.38% నష్టంతో 284 వద్ద నిలిచింది.

షెల్ డీజిల్ లీటర్ 20 పెంపు

లీటర్ విక్రయ ధర రూ.130

న్యూఢిల్లీ: షెల్ ఇండియా తన అవుట్‌లెట్ల ద్వారా విక్రయించే డీజిల్ ధరను లీటర్‌పై రూ.20 పెంచుతున్నట్టు ప్రకటించింది. వారం లోపే రెండో విడత ధరలను పెంచింది. దేశంలో అధిక వాటా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా అవే రేట్లను కొనసాగిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విక్రయ ధరల్లో ఎలాంటి సవరణలు చేయకపోవడం గమనించొచ్చు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మే నెలలో 75 డాలర్లలోపు ఉంటే, ప్రస్తుతం 95 డాలర్లపైకి చేరుకోవడం తెలిసిందే. షెల్ ఇండియా గత వారం కూడా లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున పెంచింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ స్టేషన్లు ఉన్నాయి. ముంబైలో లీటర్ డీజిల్‌ను రూ.130కు, చెన్నైలో రూ.129 చొప్పున విక్రయిస్తోంది. పెట్రోల్ లీటర్ ధర రూ.117-118గా ఉంది. అదే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు లీటర్ డీజిల్‌ను రూ.95, లీటర్ పెట్రోల్ ధరను రూ.107 స్థాయిలో విక్రయిస్తుండడం గమనార్హం. ప్రాంతాలను బట్టి ఈ రేట్లలో స్వల్ప మార్పులు ఉంటాయి.



వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్పాన్సర్ల క్యూ..

- 26 స్పాన్సర్లు, 500 పైగా అడ్వర్టైజర్లు
- లిస్టులో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా
- డిస్నీ స్టార్ వెల్లడి

న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఐసీసీ వరల్డ్ కప్ 2023 మ్యాచ్‌లను స్పాన్సర్ చేసేందుకు కంపెనీలు భారీ ఎత్తున క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 26 స్పాన్సర్లు, 500 ప్రకటనకర్తలు నమోదు చేసుకున్నట్లు టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మ్యాచ్‌ల ప్రసార హక్కులను దక్కించుకున్న డిస్నీ స్టార్ స్పోర్ట్స్ విభాగం హెడ్ సంజోగ్ గుప్తా తెలిపారు. వీటిలో చాలా స్పాన్సర్లు టీవీ, డిజిటల్ ఫార్మాట్లను ఎంచుకోగా, కొన్ని కంపెనీలు కేవలం డిజిటల్ లేదా టీవీని మాత్రమే ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నిర్వహించే 48 మ్యాచ్‌లను డిస్నీ స్టార్ తమ టీవీ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం చేయనుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లు తొమ్మిది భాషల్లో 100 పైచిలుకు కామెంటేటర్స్‌తో డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్నాయి. వీటిలో తెలుగు, తమిళం



తదితర భాషలు కూడా ఉన్నాయి. పన్నెండేళ్ల తర్వాత వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమిస్తోంది.

భారత్‌పై అంచనాలు.. పండుగ సీజన్ దన్ను

ఆసియా కప్‌లో భారత మెరుగైన పనితీరు, పండుగ సీజన్, భారత్ టీమ్‌పై భారీ అంచనాలు తదితర సానుకూలాంశాల కారణంగా అడ్వర్టైజర్లు భారీగా ఆసక్తి చూపుతున్నట్లు గుప్తా చెప్పారు. అన్ని కేటగిరీల కంపెనీలూ స్పాన్సర్ చేసేందుకు లేదా ప్రకటనలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సాధారణంగా పండుగ సీజన్‌లో కంపెనీలు ప్రకటనలపై భారీగా వెచ్చిస్తుంటాయని తెలిపారు. స్పాన్సర్ల జాబితాలో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా అండ్ మహీంద్రా, డ్రీమ్11, హెచ్‌యూఎల్, హావెల్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పెర్నాడ్ ఇండియా, బుకింగ్ డాట్‌కామ్, పీటర్ ఇంగ్లాండ్, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మాండెలీజ్, ఎమిరేట్స్, డయాజియో, ఎంఆర్‌ఎఫ్, లెండింగ్‌కార్ట్, టీబీసీఎల్, హెర్బాలైఫ్, హయర్, యాంఫీ, గూగుల్ పే, పాలీక్యాబ్, అమూల్, విడా, అమెజాన్ మొదలైన సంస్థలు న్నాయి. కోకా-కోలా, ఫోన్‌పే, హెచ్‌యూఎల్ వంటి పలు కంపెనీలు ఇటు టీవీ, అటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ స్పాన్సర్ చేస్తున్నాయి.

అనువైన ప్యాకేజీలు..

ప్రకటనకర్తల బడ్జెట్, అవసరాలను బట్టి వారికి అనువైన ప్యాకేజీలను రూపొందించినట్లు గుప్తా చెప్పారు. 'పండుగ సీజన్ సందర్భంగా.. ఎవరైనా అడ్వర్టైజరు దీపావళి సమయంలో ఎక్కువ మంది కస్టమర్లు తమ ఉత్పత్తులపై మక్కువ చూపుతారనే ఉద్దేశంతో పండుగకి ముందు ఓ రెండు వారాలపాటు ప్రకటనలు ఇవ్వదల్చుకున్నారనుకుందాం. కాస్త ప్రీమియం చెల్లించి ఆ వ్యవధిలో మాత్రమే తమ ప్రకటనలను ప్రసారం చేసుకునేందుకు వీలు కల్పించేలా వారికోసం కస్టమైజ్డ్ ప్యాకేజీని అందిస్తున్నాం' అని తెలిపారు. వరల్డ్ కప్‌లో మరింత మంది ప్రకటనకర్తలు భాగమయ్యేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ''సెల్ఫ్-సర్వ్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రవేశపెట్టినట్లు గుప్తా తెలిపారు. ఏజెన్సీలు, అడ్వర్టైజర్లు సేల్స్ టీమ్స్ జోక్యం లేకుండా, తమకు అవసరమైన వాటిని స్వయంగా బుక్ చేసుకునే వీలుంటుందని వివరించారు.

ఇంటి వద్దకే ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు

మొబైల్ డివైజ్‌లతో సర్వీసుల ఆవిష్కరణ

ముంబై: అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి చేర్చే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారా కూడా సేవలు అందించే విధానాన్ని ఆవిష్కరించింది. నేరుగా ఖాతాదారుల ఇంటి ముంగిట్లోకే కియోస్క్ బ్యాంకింగ్ సర్వీసులను తీసుకెళ్లేందుకు ఈ విధానం ఉపయోగపడగలదని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులు మొదలైన వారికి ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సర్వీసులు అందించడంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్లకు వీటితో వెసులుబాటు లభిస్తుందన్నారు. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్స్ వంటి అయిదు రకాల సర్వీసులు ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు అకౌంటు తెరవడం వంటి ఇతర సేవలను కూడా చేర్చే యోచనలో ఎస్‌బీఐ ఉంది.



భవిత

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో.. Quiz, Drawing, Essay పోటీలు. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే ఈ క్యూఆర్ స్కాన్ చేయండి.. మీ మేధస్సుకు పదును పెట్టి.. ఈ పోటీల్లో పాల్గొనండి.. విజేతలుగా నిలవండి. -ఆల్ ది బెస్ట్..

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో పదకొండో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి జవ హర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్)ఉంటాయి. మొత్తం 100ప్రశ్నలు -100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికేట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.02.2024.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

ఐవోసీఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐవోసీఎల్ రీజియన్‌లలో గేట్-2024 ద్వారా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్ 2024 స్కోరు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గేట్ 2024 ఫలితాలు వెల్లడి తర్వాత ఐవోసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.iocl.com

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో 68 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఫిజిసిస్ట్-02, క్లినికల్ సైకాలజిస్ట్-01, మెడికల్ ఆఫీసర్(ఆయుష్)-01, యోగా ఇన్‌స్ట్రక్టర్-01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-02, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్-04, స్టోర్ కీపర్-04, జూనియర్ ఇంజనీర్-03, జూనియర్ ఫిజియోథెరపిస్ట్-01, జూనియర్ ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్-02, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-01, ఆప్టోమెట్రిస్ట్-02, టెక్నీషియన్(ల్యాబొరేటరీ)-16, టెక్నీషియన్(రేడియాలజీ)-02, ఫార్మసిస్ట్-05, ఫైర్ టెక్నీషియన్-02, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్‌లు-02, స్టెనోగ్రాఫర్-04, లాండ్రీ సూపర్‌వైజర్-01, జూనియర్ వార్డెన్-02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2/డిగ్రీ/ఎంబీఏ /ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/ఎంఏ/పీజీ డిప్లొమా/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ టెస్ట్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

కాళోజీ వర్సిటీలో ఎంపీటీ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు.
» **అర్హత:** బీపీటీ డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 30.09.2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2023
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

బోధన, పరిశోధనకు.. నెట్

బోధన, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి మార్గం.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ నెట్! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. రీసెర్చ్‌కు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్ పొందొచ్చు. మరో వైపు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులూ దక్కించుకోవచ్చు. యూజీసీ-నెట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా యూజీసీ నెట్-డిసెంబర్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

» యూజీసీ నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ 6 నుంచి 22 వరకు పలు స్లాట్లలో పరీక్షలు
» నెట్‌లో ఉత్తీర్ణతతో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత
» 80కు పైగా సబ్జెక్ట్‌లలో నెట్ నిర్వహణ

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో పరిశోధనలకు మార్గాలు అనేకం. కానీ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు రీసెర్చ్ అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ-నెట్. దీనిద్వారా సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధన అవకాశాలు అందుకోవచ్చు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి యూజీసీ-నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

83 సబ్జెక్టుల్లో నెట్

యూజీసీ నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి ప్రకటన ఇచ్చింది. 83 సబ్జెక్ట్‌లలో డిసెంబర్ 6 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించనుంది. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు కేటగిరీలుగా

- యూజీసీ-నెట్‌ను సాధారణంగా రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరు కావాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- రీసెర్చ్/జేఆర్ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితమవ్వాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లలో పరీక్ష

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్-1.. 50 ప్రశ్నలు-100 మార్కులకు ఉంటుంది. ఇందులో టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్-2.. 100 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇది అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ నాలెడ్జ్ పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేదు.

పేపర్ ఎంపిక ఎలా

- అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ..పేపర్-1కు తప్పనిసరిగా హాజరు కావాలి.
- అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పరీక్ష పేపర్ 2. ఉదాహరణకు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు ఎకనామిక్స్ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.



కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్-ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

ఆరు శాతం మందిని మాత్రమే తుది జాబితాకు ఎంపిక చేసే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి.

పేపర్-1కు ఉమ్మడిగా

రెండు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహించే పేపర్-1లో అభ్యర్థుల టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్-గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2 సబ్జెక్ట్ పేపర్

పేపర్-2లో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఎందుకంటే.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతోంది.

ఆరు శాతం మంది మాత్రమే

మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా (అసిస్టెంట్ ప్రొఫెసర్) ప్రకటిస్తారు. అదేవిధంగా జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ అభ్యర్థుల ఎంపికలోనూ కనీస అర్హత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించనున్నారు. ఇందుకోసం పలు స్లాట్లలో నిర్వహించనున్న పరీక్షను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం-నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం-అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించాలని యూజీసీ నిర్దేశించింది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో రెండేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత మరో రెండేళ్లు సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది.
- జేఆర్ఎఫ్ హోదాలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్ట్‌లుగా కెరీర్ ప్రారంభించొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఆర్ట్స్,హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేది:** 28.10.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 30, 31 అక్టోబర్ 2023
- **పరీక్ష తేదీలు:** 06.12.2023 నుంచి 22.12.2023 వరకు
- **వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in